పాఠం 19

# రాజకీయ ధోరణుల ఆవిర్భావం : 1977-2000

- గత అధ్యాయంలో చర్చించిన స్వతంత్ర భారతదేశంలోని రాజకీయ ఘటనల గురించి క్లుప్తంగా రాయండి.

ఈ అధ్యాయంలో భారతదేశ ఆధునిక రాజకీయ ఘటనల గురించి వివరంగా తెలుసుకుందాం. ఈ ఘటనలు, అంశాలలో అనేకం దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని తీవ్ర విభజనకు, పరస్పర విరుద్ధ భావాలకు లోను చేసింది. పోటీతో కూడిన బహుళ పార్టీ వ్యవస్థ ఏర్పడటం వలన పార్టీ వ్యవస్థ మారిపోయింది. ఈ మార్పు వల్ల ఏ ఒక్క పార్టీ కూడా తనంతట తాను ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యలేకపోవటంతో వరుసగా అనేక సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఆర్థిక రంగంలో అభివృద్ధి విధానంలో ఈ కాలం ప్రధాన మార్పులను తెచ్చింది. మార్కెటు ఆర్థిక విధానం, రాజకీయాల ప్రజాస్వామ్యం మధ్య ఘర్షణలు ఈ కాలంలో చోటు చేసుకోసాగాయి. ఇదే సమయంలో మత, కుల భేదాలను కొత్తగా సింగారించి వాటిని రాజకీయ సమీకరణకు ఉపయోగించుకున్నాయి. ఈ సమకాలీన అంశాలు రాజ్యాంగంలోని మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, దేశ ఐక్యత, సమగ్రత, సామాజిక, ఆర్థిక మార్పులను ఎలా ప్రభావితం చేస్తున్నాయో ఈ అధ్యాయంలో చూద్దాం.

ఈ కాలంలోని ఘటనలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తమ నమ్మకాలను బట్టి తమ సొంత దృక్పథాలు ఉంటాయి. అయితే ఇతరుల దృక్పథాలను అర్థం చేసుకోవాలి, ఇతరులు నొచ్చుకోకుండా తమ అభిప్రాయాన్ని వెల్లడించాలి. ఈ అధ్యాయంలో చర్చించిన పరిణామాలు ప్రజాస్వామిక సంస్థల, స్వభావం భవిష్యత్తు పై ముఖ్యమైన ప్రభావాన్ని చూపిస్తాయి, వాటి వివిధ కోణాలను అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం. మన ప్రజాస్వామ్య పరిపక్వత ఈ చర్చలను ఎలా నిర్వహించాం అన్న దానిపై ఆధారపడి ఉంటుంది.

| | |
|---|---|
| అత్యవసర పరిస్థితి ముగింపు, మొరార్జీ దేశాయి, చరణ్ సింగ్‌ల కింద జనతాపార్టీ ప్రభుత్వాల ఏర్పాటు | 1977 |
| ఇందిరాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు | 1980 |
| టిడిపి ఏర్పాటు | 1982 |
| ఆపరేషను 'బ్లూస్టార్', ఇందిరాగాంధీ హత్య | 1984 |
| పంజాబ్‌పై హెచ్ ఎస్ లాంగొవాల్‌తోనూ, అస్సాంపై ఎఎఎస్‌యుతోనూ రాజీవ్‌గాంధీ ఒప్పందాలు | 1985 |
| మిజో నేషనల్ ఫ్రంట్‌తో ఒప్పందం | 1986 |
| శ్రీలంకతో ఒప్పందం | 1987 |
| విపి సింగ్, చంద్రశేఖర్‌లతో జనతాదళ్ ప్రభుత్వాల ఏర్పాటు | 1989 |
| మండల కమిషన్ సిఫారసుల అమలుకు నిర్ణయం | 1989 |
| రామజన్మభూమి రథయాత్ర | 1990 |
| రాజీవ్‌గాంధీ హత్య, పివి నరసింహారావు ప్రధానమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం | 1991 |
| ఆర్థిక సరళీకరణ విధానాలు | 1990 |
| బాబ్రి మసీదు కూల్చివేత | 1992 |
| దేవెగౌడ, ఐకె గుజ్రాల్‌లు ప్రధానమంత్రులుగా నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం | 1996 |
| ఎబి వాజ్‌పేయి నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం | 1998 |

## అత్యవసర పరిస్థితి తరువాత తిరిగి ప్రజాస్వామ్యం

1975–85 మధ్య కాలం భారతదేశ ప్రజాస్వామ్యానికి పరీక్షాకాలం వంటిది. అది మౌలిక ప్రజాస్వామిక హక్కులను తిరస్కరించిన అత్యవసర పరిస్థితితో మొదలయ్యి రాజీవ్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక ఎన్నికల విజయంతో ముగిసింది. ఈ కాలం కాంగ్రెస్ పార్టీ పాలనతోనే మొదలయ్యి ముగిసినప్పటికీ కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయాలు రూపొందాయి. అనేక దేశాలలో జరిగినట్లు ఇది భారతదేశం కూడా 'ఏక పార్టీ ప్రజాస్వామ్యం'లోకి జారిపోకుండా సమర్థవంతంగా నివారించింది. పోటీదారు ప్రత్యామ్నాయాలు ఏర్పడటంతో భారతీయ ఓటర్లకు ఎంచుకోటానికి అవకాశం లభించింది. దీనివల్ల రాష్ట్ర స్థాయి, జాతీయ రాజకీయాలలో విభిన్న రాజకీయ దృక్పథాలకు, వర్గ ప్రయోజనాలకు అవకాశం లభించింది. సోషలిస్టులు, హిందూ జాతీయతావాదులు, కమ్యూనిస్టుల వంటి రాజకీయ దృక్పథాలు, రైతులు, దళితులు, వెనకబడిన కులాలు, ప్రాంతాల వంటి వర్గ ప్రయోజనాలు కూడా ముందుకొచ్చి తమ హక్కుల కోసం పోరాడసాగాయి. ఇదే సమయంలో పర్యావరణ ఉద్యమం, స్త్రీవాద ఉద్యమం, పౌరహక్కుల ఉద్యమం, సాహిత్య ఉద్యమం వంటి అనేక రాజకీయేతర ఉద్యమాలు మొదలయ్యి సామాజిక మార్పునకు బలమైన చోదక శక్తిగా మారాయి. వీటిల్లోని కొన్ని అంశాలను మరింత వివరంగా చూద్దాం.


- పలు పార్టీల ప్రజాస్వామ్యంతో పోలిస్తే 'ఏక పార్టీ ప్రజాస్వామ్యం' మెరుగైన ప్రత్యామ్నాయంగా ఉండేదా?
- నిరసన, మార్పులకు సంబంధించి సామాజిక ఉద్యమాలకు అనువైన పరిస్థితులను పలు పార్టీల ప్రజాస్వామ్యం ఎలా దోహదం చేస్తుంది?

## 1977 ఎన్నికలు, అత్యవసర పరిస్థితికి ముగింపు

1977 జనవరిలో ఎన్నికలను ప్రకటించినప్పుడు అందరూ ఆశ్చర్యానికి లోనయ్యారు. ఎన్నికలు జరుగుతాయని ఎవరూ ఆశించలేదు. రాజకీయ ఖైదీలందరినీ కూడా ఇందిరాగాంధి విడుదల చేశారు. దీనితో పాటు స్వేచ్ఛగా తిరగటం, ప్రచారం చేయటం, సమావేశం నిర్వహించటం వంటి వాటి మీద నిషేధం ఉన్న ప్రాంతాలలో నియంత్రణలను తొలగించారు. కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా అన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు కలిసి పోటీ చెయ్యాలని నిర్ణయించాయి. కాంగ్రెస్(ఓ), స్వతంత్ర పార్టీ, భారతీయ జన సంఘ్, భారతీయ లోక్ దళ్, సోషలిస్టు పార్టీలు విలీనమయ్యి జనతాపార్టీగా ఏర్పడాలని నిర్ణయించాయి. జగ్జీవన్‌రాం వంటి ముఖ్యమైన కాంగ్రెస్ నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ వ్యతిరేక వేదికలో చేరారు. ఇతర ప్రధాన ప్రతిపక్ష పార్టీలయిన డిఎంకె, ఎస్‌ఎడి, సిపిఐ(ఎం) వంటివి తమ ఉనికిని కొనసాగించాలనీ, అయితే కాంగ్రెస్ వ్యతిరేక వేదికలో జనతా పార్టీకి మద్దతు ఇవ్వాలనీ నిర్ణయించుకున్నాయి. కాంగ్రెస్ వ్యతిరేక, అత్యవసర పరిస్థితి వ్యతిరేక పార్టీలు అన్నీ ఒక తాటికిందకు వచ్చి ఎన్నికలలో పోటీ చేయటంలో జయప్రకాష్ నారాయణ్, ఆచార్య జెబి కృపలాని వంటి సీనియర్ నాయకులు ముఖ్యపాత్ర పోషించారు. సామాజిక, రాజకీయ అంశాలపై ఈ పార్టీలలో కొన్నింటికి పూర్తి విరుద్ధ భావాలు ఉన్నాయన్న విషయాన్ని ఇక్కడ గుర్తు ఉంచుకోవాలి.

భారతదేశ ప్రజాస్వామ్యానికి అది ఒక చారిత్రాత్మకమైన ఎన్నిక. మొదటిసారి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఓటమిని చవి చూసింది.

ఈ సమయంలోనే నీలం సంజీవరెడ్డి 1977 మార్చి 26న ఆరవ లోకసభకు స్పీకరుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వగా ఆయన భారత రాష్ట్రపతి పదవికి ఏకగ్రీవంగా ఎన్నికై, 1977 జులై 25న భారత ఆరవ రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశాడు. దీనితో రాజకీయ పార్టీలు సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం ద్వారా పాలించడం అనే ఒక క్రొత్త ధోరణిని రాజకీయ చరిత్రలో ప్రారంభించాయని స్పష్టమౌతుంది. గొప్ప రాజనీతివేత్తలు అవలంభించిన ఉన్నత ప్రమాణాలతో కూడిన వ్యక్తిగత జీవితాలను అంగీకరిస్తూ వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రాధాన్యత ఇవ్వడం అనేది సాంప్రదాయిక పార్టీ రాజకీయాల్లో వచ్చిన ఒక మలుపు అని చెప్పవచ్చు. నీలం సంజీవరెడ్డి పాలనా కాలంలో, మొరార్జీ దేశాయ్, చరణ్‌సింగ్, ఇందిరాగాంధీ ప్రధాన మంత్రులుగా ఏర్పాటు చేసిన మూడు ప్రభుత్వాలతో పనిచేశారు.



*చిత్రం 19.1 : భారత 6వ రాష్ట్రపతి నీలం సంజీవ రెడ్డి*

గెలుపొందిన జనతా పార్టీ తన స్థానాన్ని సుస్థిర పరుచుకోటానికి తొమ్మిది రాష్ట్రాలలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను తొలగించింది. శాసన సభలలో ఆధిక్యత ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను వాటి ఆ పార్టీ పార్లమెంటు ఎన్నికలలో ఓడిపోవటంతో వాటిని కేంద్ర ప్రభుత్వం తొలగించటం న్యాయమైనదేనా? కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది కాబట్టి రాష్ట్రాలలో సైతం పాలించే హక్కుని కోల్పోయిందని జనతా పార్టీ సమర్థించు కుంది. ఆ రాష్ట్రాలలో తిరిగి ఎన్నికలు జరిగినప్పుడు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, బీహార్‌లలో జనతా పార్టీ, పశ్చిమ బెంగాల్‌లో సిపిఐ(ఎం), తమిళనాడులో డిఎంకె గెలవటంతో ఆ పార్టీ నిర్ణయం కొంతవరకు సరైనదేననిపించింది.

### 1970లలో కొన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు

**బిఎల్‌డి – భారతీయ లోక్ దళ్** – భారతీయ రైతులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అన్న సోషలిస్టులతో ఏర్పడిన పార్టీ, ప్రధానంగా ఉత్తరప్రదేశ్‌లో ఉంది.

**కాంగ్రెస్ (ఓ)** – ఇందిరాగాంధి విధానాలను వ్యతిరేకించిన కాంగ్రెస్‌లోని సాంప్రదాయవాద వర్గం.

**సిపిఐ(ఎం) – భారతీయ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)** – జాతీయ స్థాయి ఉన్న పార్టీ, పెను భూ సంస్కరణలకు, కార్మిక సంఘాలు, సోషలిస్టు విధానాలకు కృషి చేస్తున్న పార్టీ.

**డిఎంకె – ద్రవిడ మున్నేట్రకజగం** – ప్రధానంగా తమిళనాడులో ఉన్న పార్టీ, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్వయం ప్రతిపత్తి కోరే పార్టీ.

**జన సంఘ్** – హిందూ జాతీయతావాది పార్టీ, ప్రధానంగా, ఉత్తరాది రాష్ట్రాలకు పరిమితమై ఉంది.

**ఎస్ఎడి – శిరోమణి అకాలీ దళ్** – పంజాబ్‌కి పరిమితమై సిక్కుల కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న పార్టీ, గురుద్వారాల ఆధారంగా సంఘటితమై ఉంది. కాబట్టి దీనికి కొంత మతపరమైన స్వభావం ఉంది. ఇది కూడా రాష్ట్రాలకు మరింత స్వయం ప్రతిపత్తిని కోరిన పార్టీ.



చిత్రం 19.2 : మొదటి కాంగ్రెసేతర ప్రధానమంత్రియైన మొరార్జీ దేశాయి

ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛని పునరుద్ధరిస్తామన్న వాగ్దానంతో జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అంతర్గత విభేదాల కారణంగా దాని పాలన ప్రభావితం అయ్యింది. అంతర్గత కీచులాటలకు, ఫిరాయింపులకు ఈ పాలన గుర్తుండిపోయింది. పార్టీలో అంతర్గత కుమ్ములాటల వల్ల మూడు సంవత్సరాలలోపే ప్రభుత్వం పడిపోయి 1980లో తాజా ఎన్నికల నిర్వహణకు దారితీసింది.

1980లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. వెంటనే తొమ్మిది రాష్ట్రాలలోని కాంగ్రేసేతర, జనతా ప్రభుత్వాలను రద్దు చేసి జనతాపార్టీ రీతిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో మినహాయించి మిగిలిన అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ విజయం సాధించింది.

జనతా పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు సమాఖ్య సూత్రాలను బలహీనపరిచి కేంద్రీకృత చర్యలకు మద్దతునిచ్చాయి. దీనితోపాటు దేశ సమైక్యతకు కొన్ని తీవ్రమైన సవాళ్లు ఎదురయ్యాయి. అనేక రాష్ట్రాల ప్రజలు పరాయీకరణ భావనకు లోనయ్యి కేంద్రం నుంచి మరింత స్వయం ప్రతిపత్తిని, కొన్ని భారతదేశం నుంచి విడిపోటాన్ని కోరుకున్నాయి. జాతీయస్థాయిలో మరింత నిర్ణయాత్మకమైన పాత్ర, మరింత ఆర్థిక స్వయం ప్రతిపత్తి, రాష్ట్ర విషయాల్లో జోక్యం చేసుకోకపోవటం, గవర్నరు అధికారాల దుర్వినియోగం, ఇష్టమొచ్చినట్లు రాష్ట్రపతి పాలన విధించటం వంటి అంశాలతో కాంగ్రెసేతర ప్రాంతీయ రాజకీయ పార్టీలు (ఎన్ఏడి, డిఎంకె వంటివి) ఒక వేదికగా ఏర్పడ్డాయి.

### రాష్ట్రపతి పాలన

రాజ్యాంగంలోని 356 అధికరణం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాన్ని పాలించలేక పోతోందని గవర్నరు అభిప్రాయపడితే రాష్ట్ర ప్రభుత్వాన్ని తొలగించమని, ఇంకా అవసరమైతే శాసన సభను రద్దు చెయ్యమని రాష్ట్రపతికి సిఫారసు చెయ్యవచ్చు. అప్పుడు ప్రధానమంత్రి సలహాతో రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రపతి తొలగించి పాలనా బాధ్యతలను చేపట్టమని రాష్ట్ర గవర్నరును కోరవచ్చు.

దీనికి సంబంధించి ఖచ్చితమైన మార్గదర్శకాలు రాజ్యాంగంలో లేనందున అనేక కేంద్ర ప్రభుత్వాలు తరచుగా 356వ అధికరణాన్ని రాష్ట్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న ఇతర ప్రతిపక్ష పార్టీలను వేధించడానికి, తొలగించడానికి దుర్వినియోగ పరిచేవి.


కేంద్ర ప్రభుత్వం 356 అధికరణాన్ని ప్రయోగించటానికి 1994లో సుప్రీంకోర్టు ఇచ్చిన కీలకమైన తీర్పులో ఖచ్చితమైన నియమాలను పేర్కొంది. అప్పటినుంచి, ఈ అధికారాన్ని దుర్వినియోగపరచటం అరుదయ్యింది.

- రాష్ట్రాలలో వేరే రాజకీయ పార్టీలకు చెందిన ప్రభుత్వాలు ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని తొలగించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రజాస్వామిక సూత్రాలకు ఇది ఎలా భంగం కలిగిస్తోందో చర్చించండి.

### ప్రాంతీయ ఆకాంక్షల ఆవిర్భావం

భారతదేశంలోని విభిన్న ప్రాంతాల్లో మరింత స్వయం ప్రతిపత్తి కోసం జరిగిన మూడు ఉద్యమాలను పరిశీలిద్దాం. ఇవి ఆంధ్రప్రదేశ్, అసోం, పంజాబు. వీటి మధ్య పోలికలు, తేడాలు గుర్తించండి. స్వయం ప్రతిపత్తికి సంబంధించి మూడు రకాల ధోరణులకు ఇవి ప్రాతినిధ్యం వహిస్తాయి.

## ఆంధ్రప్రదేశ్



చిత్రం 19.3 : ఎన్.టి. రామారావు

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులను కేంద్ర కాంగ్రెస్ నాయకత్వం తరుచు మారుస్తుండటం, పైనుంచి నాయకులను రుద్దటం ఇక్కడి ప్రజలకు నచ్చలేదు. జాతీయ కాంగ్రెస్ నాయకత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ నాయకత్వానికి తగినంత గౌరవం లభించటంలేదని భావించసాగారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి అవమానం జరిగిందని భావించసాగారు. జనాదరణ ఉన్న సినీ నటుడైన ఎన్.టి. రామారావు (ఎన్‌టిఆర్) ఈ అంశాన్ని చేపట్టాడు. 1982లో తన 60వ పుట్టినరోజునాడు తెలుగు దేశం పార్టీ (తెదేపా)ని స్థాపించాడు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం తెదేపా కృషి చేస్తుందని అతడు చెప్పాడు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ క్రిందిస్థాయి కార్యాలయంగా పరిగణించటానికి వీలు లేదని అతడు వాదించాడు. పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, మద్యపాన నిషేధం వంటి పేదల సంక్షేమ పథకాలను కూడా అతడు ప్రకటించాడు. ఈ జనాకర్షక చర్యల వల్ల 1982 ఎన్నికలలో తెదేపా ఘన విజయం సాధించింది. అయితే అతడు 1984లో ఆపరేషను కోసమని అమెరికాకి వెళ్లినప్పుడు గవర్నరు అతడి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశాడు. తెదేపా నుంచి కాంగ్రెస్‌కి పార్టీ ఫిరాయించిన ఎన్. భాస్కరరావుని ముఖ్యమంత్రిగా గవర్నరు ఆహ్వానించాడు. అమెరికానుంచి తిరిగి వచ్చిన తరువాత ఎన్‌టిఆర్ గవర్నరు చర్యను సవాలుచేసి శాసనసభ్యులలో మెజారిటీ మద్దతు తనకే ఉందని నిరూపించాడు. ఒక నెల రోజుల ప్రజా ఉద్యమం తరువాత కేంద్ర ప్రభుత్వం కొత్త గవర్నరును నియమించింది. అతడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్.టి. రామారావుని తిరిగి నియమించాడు. తన ప్రభుత్వాన్ని అకారణంగా తొలగించటంపై చేసిన పోరాటంలో ఎన్‌టిఆర్‌కి ఇతర రాష్ట్రాలలో అధికారంలో ఉన్న సిపిఐ(ఎం), డిఎంకె, ఎస్‌ఎడి, నేషనల్ కాన్ఫరెన్స్ వంటి అనేక పార్టీలు మద్దతునిచ్చాయి.

- ఎన్‌టిఆర్ రాజకీయాలలో ఈ దిగువ అంశాల ప్రాముఖ్యతను చర్చించండి.
  - i. సినీ హీరోగా ఉన్న నేపథ్యం
  - ii. రాష్ట్ర ఆత్మగౌరవం కోసం పోరాటం
  - iii. పేదలకు జనాకర్షక సంక్షేమ పథకాలు
  - iv. ఇతర ప్రాంతీయ పార్టీలతో సంబంధాలు

## అసోం (అస్సాం) ఉద్యమం

స్వయం ప్రతిపత్తికి ఇదే రకమైన కానీ ఇంకా బలమైన ఉద్యమం అసోంలో జరుగుతోంది. అసోంలో అస్సామీ భాషే కాకుండా బెంగాలీ భాష కూడా ఎక్కువగా మాట్లాడతారు. బ్రిటిష్‌పాలన నాటి నుంచి రాష్ట్ర పరిపాలనలోని కింది, మధ్యస్థాయి ఉద్యోగాలలో బెంగాలీలు ఉండేవాళ్లు. బెంగాలీ అధికారులు తమని సమానులుగా కాకుండా రెండవ తరగతి పౌరులుగా చూస్తున్నారని అస్సామీయులు భావించే వాళ్లు. స్వాతంత్ర్యం తరువాత బెంగాలీ మాట్లాడే ప్రజలు పెద్ద సంఖ్యలో అసోంలో స్థిరపడసాగారు. ఇవన్నీ చాలవన్నట్లు సరిహద్దు ఆవల బంగ్లాదేశ్‌నుంచి ఎంతోమంది వలస రాసాగారు. పొరుగు దేశంలో రాజకీయ అస్థిరత, లేదా ప్రకృతి వైపరీత్యం సంభవించినప్పుడు వేలాది ప్రజలు రాష్ట్రంలోకి వలస వచ్చి

స్థానికులకు ఇబ్బంది కలిగించసాగారు. స్థానిక ప్రజలు తమ సాంస్కృతిక మూలాలు కోల్పోతామనీ, అంతేకాకుండా 'బయటివాళ్లు' ఎక్కువైపోయి జనాభాలో తమ సంఖ్య తగ్గుతుందనీ భయపడసాగారు.

ప్రజలలో ఉన్న ఈ అసంతృప్తి 1970లలో సామాజిక ఉద్యమంగా మారింది. అఖిల అసోం విద్యార్థి సంఘం (ఎఎఎస్‌యు) ఈ ఉద్యమానికి ముందు నిలిచింది. ఈ సంఘం రాష్ట్రమంతా విస్తరించింది, ప్రత్యేకించి యువతలో దానికెంతో ఆదరణ లభించింది. తన కోరికలను– ప్రధానంగా బయటవాళ్లను తీసెయ్యమంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో సమ్మెలు, ఆందోళనలు, పాదయాత్రలు నిర్వహించింది.

సంస్కృతి, జనాభా అంశాలే కాకుండా ఈ ఉద్యమానికి ఆర్థిక కోణం కూడా ఉంది. వ్యాపారం, ఇతర సంస్థలు అస్సామేతర ప్రజల చేతుల్లో ఉండేవి. రాష్ట్రంలోని ప్రధాన వనరులైన టీ, చమురు వల్ల స్థానికులకు ప్రయోజనం ఒనగూరటం లేదు. టీ పరిశ్రమ ప్రధానంగా కోల్‌కతాలో ఉంది. చమురు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఉన్నప్పటికీ స్థానికులలో చాలా కొద్దిమంది మాత్రమే అందులో ఉన్నారు. అంతేకాకుండా చమురుని రాష్ట్రం నుంచి తరలించి వేరేచోట్ల శుద్ధి చేస్తున్నారు. వీటన్నిటి సారాంశం ఏమిటంటే అసోంని 'అంతర్గత వలస ప్రాంతం'గా పరిగణిస్తున్నారని, దీనిని ఆపివేయాలని ప్రజలు ఉద్యమించారు. ఉపాధిలో స్థానిక ప్రజలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం, "బయటివాళ్ల"ను తొలగించటం, వనరులను స్థానిక ప్రజల ప్రయోజనం కోసం వినియోగించటం అన్నవి ప్రధాన కోరికలు.

ఈ కోరికలు ప్రజల్లో మతపరమైన భేదాలను సృష్టించాయి. ఎందుకంటే పొరుగు దేశంనుంచి వచ్చిన బయటివాళ్లల్లో ఎక్కువమంది ముస్లింలు ఉన్నారు. ఉద్యమం బెంగాలీ వ్యతిరేక, వామపక్ష వ్యతిరేక (పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉంది), అస్సామేతర ప్రజల పట్ల వ్యతిరేకత, అంతిమంగా భారతదేశ వ్యతిరేకతను సంతరించుకోవటంతో పరిస్థితులు విషమించాయి. హింస, అల్లర్లు తీవ్ర రూపం దాల్చటంతో కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టాల్సి వచ్చింది. ఆందోళనకారులు, కేంద్ర ప్రభుత్వం మధ్య మూడు సంవత్సరాల చర్చల తరువాత ఒక ఒప్పందానికి వచ్చారు. 1984లో రాజీవ్‌గాంధి చొరవతో కేంద్ర ప్రభుత్వం, ఎఎఎస్‌యు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనేలా దోహద పడటానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా తన పదవీకాలం ఉండగానే ఉదారంగా దిగిపోయి ఎన్నికలకు అవకాశం కల్పించింది. ఈ ఎన్నికలలో అసోం గణ పరిషత్ (ఎజిపి – ఎఎఎస్‌యుకి అనుబంధంగా ఏర్పడిన పార్టీ) అధికారంలోకి వచ్చింది.

అయితే, ఈ రాజకీయ మార్పు వల్ల ఈ ఉద్యమానికి కారణమైన దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కాలేదు. దౌత్యకారణాలు, భౌగోళిక కారణాల వల్ల (కొండలు, నదులు ఉండటం వల్ల అంతటా కంచె వెయ్యటం సాధ్యంకాదు) బంగ్లాదేశ్‌తో సరిహద్దును మూసి వెయ్యటం సాధ్యం కాలేదు. ఎప్పుడో వచ్చి స్థిరపడిన బెంగాలీలను, తాజాగా వలస వచ్చిన వాళ్లను గుర్తించటం సాధ్యం కాలేదు, వలస వచ్చిన వాళ్లను వెనక్కి పంపించటం సాధ్యం కాలేదు. అదే సమయంలో అస్థిత్వ మూలాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వటంతో అసోంలో బోడోలు, ఖాసీలు, మిజోలు, కర్బీలు వంటి తెగలపై వ్యతిరేక ప్రభావం పడింది. వీళ్లల్లో అనేకులు తమకు కూడా స్వయం ప్రతిపత్తి కావాలని అడగసాగారు. వాళ్లు తమ హక్కులను, కోరికలను చాటటం మొదలుపెట్టి తమ ప్రాంతాలనుంచి బయటివాళ్లను తరిమెయ్యాలనుకున్నారు. దీంతో అసోంలోని పలుప్రాంతాలలో అల్పసంఖ్యాక తెగల ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించటానికి పూనుకున్నారు. ఒక తెగ హింసాత్మక చర్యలను ఎదుర్కోటానికి ప్రభుత్వం తరుచు రెండవ తెగను

రెచ్చగొట్టటం, లేదా ఆయుధాలు సమకూర్చటం వంటివి చేసింది. దీంతో ఘర్షణలు పరిష్కరింపబడటానికి బదులుగా అవి కొనసాగటానికే ప్రభుత్వం దోహదపడింది.

ఘర్షణలు తగ్గించి, శాంతిని నెలకొల్పటానికి ఈ ప్రాంతాలలో సాయుధ బలగాలను కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నియమించసాగింది. ఈశాన్య ప్రాంతంలో సాయుధ దళాలను ప్రయోగించటానికి మూడు అంశాలు కారణమయ్యాయి: మొదటిది ఇది చైనా, బర్మా (ప్రస్తుతం మ్యాన్‌మార్), బంగ్లాదేశ్‌లతో సున్నిత సరిహద్దు ప్రాంతంగా ఉండటం; రెండవది తిరుగుబాటు బృందాలు తరచు భారతదేశం నుంచి విడిపోవాలని కోరుకోవటం; మూడవది అల్ప సంఖ్యాక వర్గాలపై తిరుగుబాటు బృందాలు పెద్ద ఎత్తున హింసాత్మక దాడులకు పాల్పడటం. భారత సైనిక దళాలు ఈ సమస్యాత్మక ప్రాంతంలోకి ప్రవేశించటంతో పౌరహక్కులు, స్వేచ్ఛ రద్దయ్యాయి. సైన్యానికి అసాధారణ అధికారాలు కట్టబెట్టారు. ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పటానికి ఇదొక్కటే మార్గమని ప్రభుత్వం భావించింది.

బెంగాలీలు, అస్సామీల మధ్య మొదలయిన ఈ సమస్య సున్నితంగా తయారయి, సంక్లిష్ట అంతః జాతి ఘర్షణలకు దారితీసింది. జాతి అస్థిత్వాలు, జాతుల సమస్య వంటి వాటిల్లో సంకుచితదృష్టి, సత్వర పరిష్కారాలు కాకుండా విశాల దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉంది.

- ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టిఆర్ ఉద్యమానికి అసోం ఉద్యమానికి పోలికలు, తేడాలు ఏమిటి?
- ఈ అంశాలపై మీ తరగతిలో చర్చ నిర్వహించండి:
  ఒక ప్రాంతంలో ఒకే సమూహానికి చెందిన ప్రజలు ఉండాలి, అన్ని ఉద్యోగాలు, అన్ని వ్యాపారాలు ఆ సమూహానికి చెందిన ప్రజల చేతిలోనే ఉండాలి. లేదా భారతదేశ ప్రజలందరూ ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి స్వేచ్ఛగా వెళ్లగలగాలి, తాము ఎంచుకున్న ప్రాంతంలో స్థిరపడటానికి, పని చెయ్యటానికి అవకాశం ఉండాలి.
- ప్రజలు స్వేచ్ఛగా సంచరించే విధానం ఉంటే బయటి నుంచి వచ్చిన ధనిక, శక్తిమంతులైన వాళ్లు భూమి, వనరులు మొత్తాన్ని కొనేసి అసలు ఆ ప్రాంతంలోని వాళ్లను పేదలు, నిర్భాగ్యులుగా మిగులుస్తారా?

## పంజాబ్ ఆందోళన

భారతదేశానికి ఇంకొకవైపున పంజాబు రాష్ట్రంలో స్వయం ప్రతిపత్తికి మరొక ఉద్యమం రూపు దిద్దుకుంటోంది. ఇక్కడ కూడా అత్యధిక శాతం ప్రజలు మాట్లాడే భాష, మతమూ ఆధారంగా ప్రజల సమీకరణ జరిగింది. ఇక్కడ కూడా దేశాభివృద్ధిలో రాష్ట్రం పాత్రను విస్మరిస్తున్నారన్నదే పంజాబ్ ఆరోపణ. రాష్ట్రం ఏర్పడినప్పుడు తమకు అన్యాయం జరిగిందని వాళ్లు భావిస్తున్నారు. రాజధాని నగరమైన చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతంగా కాక తమ రాష్ట్రానికే చెందాలని కోరసాగారు. భాక్రానంగల్ ఆనకట్ట నుంచి ఎక్కువ నీళ్లు కావాలని, సైన్యంలోకి ఎక్కువ మంది సిక్కులను తీసుకోవాలని కూడా కోరసాగారు.

కేంద్రంలో జనతా పార్టీ ప్రభుత్వం ఉండగా 1978లో అకాలీ దళ్ కొన్ని తీర్మానాలు చేసి వాటిని అమలు చెయ్యాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. రాజ్యాంగాన్ని సవరించి అధికార వికేంద్రీకరణ చేసి, రాష్ట్రాలకు ఎక్కువ అధికారం ఇవ్వాలి అన్న అంశం దాని ముఖ్యమైన కోరిక. తీర్మానం ఇలా పేర్కొంటోంది, "విభిన్న భాష, సాంస్కృతిక వర్గాల, మతపరంగా అల్ప సంఖ్యాక వర్గాల, లక్షలాది ప్రజల కోరికలను జనతా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని దేశ ఐక్యత, సమగ్రతకు ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా

చెయ్యటానికి నిజమైన, అర్థవంతమైన సమాఖ్య సూత్రాల ఆధారంగా దేశ రాజ్యాంగ నిర్మాణాన్ని మార్చవలసిందిగా శిరోమణి అకాలీ దళ్ కోరుతోంది. అంతేకాకుండా దీని వల్ల రాష్ట్రాలు తమ తమ ప్రాంతాల్లో తమ అధికారాలను ఉపయోగించి భారతదేశ ప్రజల ప్రగతి, సౌభాగ్యాలలో అర్థవంతమైన పాత్ర పోషించగలుగుతాయి.”

ఎస్ఎడి, కాంగ్రెస్‌ల మధ్య ఎన్నికల పోటీ పెరగటంతో పరిస్థితులు మరింతగా విషమించాయి. 1980లో అకాలీ ప్రభుత్వాన్ని రద్దుచేసి తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో సిక్కులు వివక్షతకు గురవుతున్నారన్న భావన పెరిగి ఉద్రిక్త వాతావరణం మరింత తీవ్రరూపం దాల్చింది. వరసగా అనేక అవాంఛిత సంఘటనలు సంభవించటంతో సిక్కులు, కేంద్ర ప్రభుత్వాల మధ్య దూరం, అపోహలు పెరిగాయి. తీవ్రవాద సిక్కుల బృందానికి నాయకుడుగా ఉన్న భింద్రేన్‌వాలా వేర్పాటు వాదాన్ని ప్రచారం చేస్తూ సిక్కులకు ప్రత్యేక దేశం ఖలిస్తాన్ కావాలని కోరసాగాడు. ఈ కాలంలో రాష్ట్రం తీవ్ర కల్లోలానికి లోనయ్యింది. తీవ్రవాదులు సిక్కులమీదే కాకుండా పంజాబ్‌లోని ఇతర మత ప్రజలపై కూడా సాంప్రదాయ, ఛాందసవాద జీవన విధానాన్ని అమలు చెయ్యటానికి ప్రయత్నించారు. ఈ ఘర్షణ మతపరమైన రంగును కూడా సంతరించుకుంది. సిక్కు మతానికి చెందని ప్రజలపై దాడులు జరిగాయి. వీటన్నిటి అంతిమ పర్యవసానంగా సిక్కు వేర్పాటు బృందాలు సిక్కుల పవిత్ర స్థలమైన గోల్డెన్ టెంపుల్‌ని ఆక్రమించుకోగా వాళ్లని అక్కడినుంచి ఖాళీ చెయ్యటానికి సైన్యం జోక్యం చేసుకోవలసి వచ్చింది. దీంతో తమ పుణ్యస్థలం అపవిత్రమయ్యిందని సిక్కులు భావించటంతో వాళ్ల విజాతిభావం మరింత తీవ్రమయ్యింది.




*చిత్రం 19.4: భారతదేశం 1970లు, 1980ల మధ్య సాంకేతిక, సహకార రంగాల వంటి వాటిల్లో ఎన్నో విజయాలను సాధించింది. శ్రీహరికోట నుంచి ఉపగ్రహ ప్రయోగం, అముల్ సహకార సంఘం వంటివి కొన్ని పైన ఉన్నాయి.*

వీటన్నిటి కారణంగా 1984లో ప్రధానమంత్రి ఇందిరాగాంధి హత్యకు గురయ్యింది. దీని తరువాత అల్లర్లు చెలరేగి, ప్రత్యేకించి ఢిల్లీలో వేలాదిమంది సిక్కులపై దాడులు చేసి, వాళ్ల ఆస్తులను విధ్వంసం చేసి, హత్య చేశారు. ఈ హింసను ఆపటానికి పాలనాయంత్రాంగం స్పందించినట్లు అనిపించలేదు.

రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయిన తరువాత ఎస్ఎడితో చర్చలు జరిపి ఎస్ఎడి అధ్యక్షుడు సంత్ లాంగోవాల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. పంజాబ్‌లో తాజాగా ఎన్నికలు నిర్వహించి ఎస్ఎడి గెలిచినప్పటికీ తీవ్రవాదులు లాంగోవాల్‌ని హత్య చెయ్యటంతో శాంతి ఎక్కువ కాలం నిలవలేదు.


1986 ఏప్రిల్‌లో అకల్ తఖ్త్ వద్ద సమావేశంలో ఖలిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించారు. స్వతంత్ర దేశం కోసం పోరాడుతున్నామన్న అనేక బృందాలు సాయుధ దళాలను ఏర్పరిచి తీవ్రవాద చర్యలకు పాల్పడసాగాయి. ఈ బృందాలకు పాకిస్తాన్ ప్రభుత్వం క్రియాశీలక మద్దతు ఇస్తోందని భారత ప్రభుత్వం పేర్కొనసాగింది. పంజాబ్‌లో ఒక దశాబ్దకాలం పాటు హింస, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ తిరుగుబాటు కాలంలో సిక్కు తీవ్రవాదులు పోలీసులతోనూ, ఇతర మత బృందాలతోనూ తలపడ్డారు. తీవ్రవాదులు నిర్దేశించిన ప్రవర్తనను పాటించని పత్రకారులు, రాజకీయ నాయకులు, కళాకారులు, కార్యకర్తలు హత్యలకు లోనయ్యారు. పౌరుల ప్రాణనష్టం పెద్ద ఎత్తున ఉండేలా విచక్షణారహిత దాడులకు పాల్పడ్డారు: రైళ్లను పట్టాలు తప్పించటం, మార్కెట్లు, రెస్టారెంట్లు, పంజాబ్–ఢిల్లీ మధ్య పౌరులుండే ప్రాంతాలలో బాంబు పేలుళ్లు వంటి చర్యలు చేపట్టారు. ఒక్క 1991 సంవత్సరంలోనే వెయ్యిమంది దాకా చనిపోయారు. నిధుల సేకరణకు తీవ్రవాదులు పెద్ద ఎత్తున అపహరణలకు, బలవంతపు వసూళ్లకు పాల్పడసాగారు. వీటన్నిటి ఫలితంగా తీవ్రవాదులు సిక్కులతో సహా పంజాబీ ప్రజలకు దూరం కాసాగారు. కాలక్రమంలో పోలీసు చర్యలు తీవ్రవాద నడ్డి విరచగా, ప్రజల సానుభూతి కోల్పోయిన నేపథ్యంలో 1990ల చివరినాటికి అంతిమంగా పంజాబ్‌లో శాంతి వెలసిల్లింది.

అయితే, పంజాబ్‌లో తీవ్రవాదాన్ని అణచివెయ్యటానికి ప్రభుత్వం చాలా తీవ్ర పద్ధతులను ఉపయోగించింది. వీటిల్లో అనేకం పౌరుల రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించాయని భావించారు. తీవ్రవాద కార్యకలాపాల వల్ల రాజ్యాంగ యంత్రాంగమే కుప్పకూలే అంచున ఉండటంతో మానవ హక్కుల, రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన సమర్థనీయమే అని చాలా మంది పరిశీలకులు భావించారు. తీవ్రవాదులపై వ్యతిరేక తీర్పులు ఇస్తే తమపై కూడా దాడులు జరుగుతాయని న్యాయమూర్తులు భయపడసాగారు. ఇతర పరిశీలకులు ప్రభుత్వం రాజ్యాంగేతర శక్తులను వినియోగించటం సరికాదని, ఇది దీర్ఘకాలంలో రాజ్యతంత్రంలో అప్రజాస్వామిక ధోరణులు బలపడటానికి దోహదం చేస్తుందని భావించారు.


- సిక్కుల వేర్పాటువాదం, తీవ్రవాదాలను ప్రేరేపించటంలో 1984లో ఢిల్లీలో చోటు చేసుకున్న సిక్కు వ్యతిరేక అల్లర్ల పాత్ర ఏమిటి?
- అసోం, పంజాబ్ ఉద్యమాల మధ్య పోలికలు, తేడాలను పేర్కొనండి. మన రాజకీయ వ్యవస్థకు అవి ఎటువంటి సవాళ్లను విసిరాయి?
- ఈ రెండు సమస్యలతో ప్రభుత్వం వ్యవహరించిన తీరు మన ప్రజాస్వామిక రాజతంత్రాన్ని బలపరిచిందా, బలహీనపరిచిందా?

## రాజీవ్‌గాంధీ కాలంలో కొత్త చర్యలు

రాజీవ్ గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ అంతకు ముందెన్నడూ లేనంతగా ఎన్నికలలో ఘనవిజయం సాధించింది. రాజీవ్‌గాంధి పంజాబ్, అసోం, మిజోరాంలలో, పొరుగుదేశమైన శ్రీలంకలో కూడా శాంతి ప్రక్రియలు మొదలుపెట్టాడు. శ్రీలంకలో ఘర్షణ పడుతున్న ఇరుపక్షాల మధ్య (వేర్పాటువాద తమిళులు, శ్రీలంక ప్రభుత్వం) శాంతి నెలకొల్పటానికి భారతదేశం తన సైన్యాన్ని పంపించింది. అయితే దీనికి అటు తమిళులు, ఇటు శ్రీలంక ప్రభుత్వమూ అంగీకరించకపోవటం వల్ల ఇదొక దుస్సాహస చర్యగా పరిణమించింది. అంతిమంగా భారతదేశం తన సైన్యాన్ని 1989లో వెనక్కి తీసేసుకుంది.



*చిత్రం 19.5 : రాజీవ్ గాంధీ*



*చిత్రం 19.6 : కొత్త ఢిల్లీ టెలిఫోన్ ఎక్స్ఛేంజిలో పనిచేస్తున్న ఆపరేటర్లు, 1950లలోని చిత్రం*

దేశంలో అభివృద్ధిపై దృష్టి పెట్టినప్పటికీ అది నిజమైన లబ్ధిదారులకు చేరటంలేదని రాజీవ్‌గాంధి గుర్తించాడు. ప్రఖ్యాతిగాంచిన ఒక ఉపన్యాసంలో పేదలకోసం ఖర్చు పెడుతున్న ప్రతి రూపాయిలో 15 పైసలు కూడా వారిని చేరటంలేదని రాజీవ్ గాంధి అన్నాడు. అభివృద్ధికి కేటాయింపులు ఎంతగానో పెరిగినప్పటికీ పేదల పరిస్థితి మాత్రం అలాగే ఉండిపోయింది. పేదరికం, అంచులకు నెట్టబడిన పేద ప్రజలు, మహిళలు, దళితులు, గిరిజనులకు అభివృద్ధి ఫలాలు అందుబాటులో ఉండటం లేదు. పనులు జరుగుతున్న విధానంలో పెనుమార్పులు తీసుకు రావాలని కూడా అతడు గ్రహించాడు. ఇందుకు పంచాయితీరాజ్ సంస్థలను క్రియాశీలకంగా మలిచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాలనలో భాగస్వాములు అయ్యేలా చెయ్యటం మంచి పద్ధతని రాజీవ్ గాంధి భావించాడు. అయితే

- ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే రాజీవ్ గాంధి దేశానికి ఒనగూర్చిన శాశ్వత ప్రయోజనాలు ఏమిటి?
- తమ కోసం ఉద్దేశించిన పథకాల వల్ల పేదప్రజలు తరచు ఎందుకు ప్రయోజనం పొందటం లేదో తరగతిలో చర్చించండి. ఇటువంటి ప్రయోజనాలు నిజంగా పేదవాళ్లకు చేరాలంటే ఏ దీర్ఘకాల చర్యలు తీసుకోవాలి?
- మీ పాఠశాల విద్యార్థులకు అందవలసిన ప్రయోజనాల జాబితా తయారు చెయ్యండి. ఇవి వాళ్లకు సరిగా అందుతున్నాయా? తరగతి గదిలోనూ, బయట క్రీడా మైదానాలలోనూ, ఇంటివద్ద చర్చించండి.

అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రత్యేకించి ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఇది తమ ద్వారా కాకుండా నేరుగా జిల్లాలకు చేరటానికి, తమ అధికారాలు తగ్గించటానికి ఉద్దేశించిన చర్యగా భావించారు.

ఆర్థికరంగంలో కూడా రాజీవ్ గాంధి భిన్న పంథాని అనుసరించటానికి ప్రయత్నించాడు. 1985లో అతడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌లో అమలులో ఉన్న కొన్ని నియంత్రణలను, పరిమితులను తొలగించి సరళీకృత ఆర్థిక విధానంవైపు పయనం మొదలుపెట్టాడు.

ప్రపంచంలో ముందుకొస్తున్న కొత్త సాంకేతిక విజ్ఞానాలను ప్రత్యేకించి కంప్యూటరు, టెలికమ్యూనికేషన్ సాంకేతిక విజ్ఞానాన్ని భారతదేశం అవలంబించాలని రాజీవ్ గాంధి గట్టిగా నమ్మాడు. అతడు భారతదేశంలో 'టెలికం విప్లవం' అనబడుతున్న దానిని ఆరంభించాడు. ఉపగ్రహ సాంకేతిక విజ్ఞానంతో దేశంలో టెలిఫోనిక్ నెట్‌వర్క్ వేగంగా విస్తరించటానికి ఇది దోహదపడింది.

## మతతత్వం, ఉన్నత స్థానాలలో అవినీతి పెరుగుదల

దేశవిభజన సమయంలో ఘోరాల తరువాత రాజకీయ రంగం నుంచి మతాన్ని దూరంగా ఉంచటానికి కొంత ప్రయత్నం జరిగింది. అయితే ఆ తరువాత కాలం మత ధోరణి ఉన్న కొత్త రాజకీయ సమీకరణను చవిచూసింది. రాజకీయ ఉద్దేశాలకు మతాన్ని వాడుకోవటం, ప్రభుత్వ పక్షపాత ధోరణి కారణంగా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీసి దేశ ఐక్యత, సమగ్రతలనే ప్రశ్నార్థకంగా మార్చింది.

### ప్రధానమంత్రి క్షమాపణ

రాజ్యసభలో డా॥ మన్‌మోహన్ సింగ్ ప్రకటన–

... 1984లో జరిగిన ఈ మహా జాతీయ విపత్తులో నాలుగు వేలమంది చంపబడ్డారు. ఒకే దేశంగా కలిసి పనిచేస్తున్న సందర్భంలో ఇటువంటి ఘోర విషాదాలు దేశంలో తిరిగి ఎన్నడూ జరగకుండా కొత్త దారులు కనుక్కోటానికి ప్రయత్నించాలి. ... ఒక్క సిక్కు ప్రజలకే కాకుండా మొత్తం భారతదేశానికి క్షమాపణలు చెప్పటానికి నేను తటపటాయించను, ఎందుకంటే 1984లో జరిగింది మన రాజ్యాంగంలో పొందుపరిచిన దానికి, జాతి అన్న భావనకు పూర్తి వ్యతిరేకమయినది. మా ప్రభుత్వం తరఫున, ప్రజలందరి తరఫున ఇటువంటి ఘటన జరిగినందుకు నేను సిగ్గుతో తల వంచుకుంటున్నాను. అయితే దేశ వ్యవహారాల్లో శిఖరాలూ ఉంటాయి, లోయలు ఉంటాయి. గతం మనతో ఉంది, దానిని తిరగరాయలేం. కానీ మానవులంగా మనందరికీ మెరుగైన భవిష్యత్తును రూపొందించగల సామర్థ్యం, దృఢ చిత్తత మనకి ఉన్నాయి...

(pmindia.mic.co/Rs%20 speech.pdf) – 2005 ఆగస్టు 11.

- ఈ ఉపన్యాసంలోని ప్రధాన సందేశం ఏమిటి?
- ఈ ఉపన్యాసం ఏ సంకేతాలను పంపిస్తోంది?
- ప్రధానమంత్రి ఈ ఉపన్యాసం చెయ్యటంలోని ప్రాముఖ్యత ఏమిటి?

భర్తనుంచి విడాకులు పొందిన షా బానో అన్న మహిళ వేసిన కేసులో 1985లో సుప్రీంకోర్టు ఆమె మాజీ భర్త ఆమెకు భరణం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. ప్రగతిశీల ముస్లిములు ఈ తీర్పును స్వాగతించారు. అయితే ఇతరులు ఈ తీర్పు ఇస్లామిక్ చట్టంలో జోక్యం చేసుకుంటోందని, దీనిని

అనుమతిస్తే తమ మత జీవితంలో జోక్యం మరింత పెరుగుతుందని నిరసనలు చేపట్టారు. ఏక పక్షంగా భర్తలతో విడాకులు ఇవ్వబడి అన్యాయానికి గురవుతున్న మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఇది అరికడుతుందని మహిళా ఉద్యమ నాయకులు, ముస్లిం సమాజంలో సంస్కరణలు కోరుకుంటున్న సభ్యులు వాదించసాగారు. ఛాందసవాద వర్గాల ఒత్తిడికి లోనైన ప్రభుత్వం 1986లో కొత్త చట్టం చేసింది. దీని ప్రకారం ముస్లిం భర్తలకు ఎటువంటి బాధ్యత లేకుండా చేసి విడాకులు పొందిన మహిళలకు మూడు నెలలలపాటు ముస్లిం మత సంస్థల భరణం ఇస్తే సరిపోతుంది. ఈ చర్య ముస్లిం మహిళల ప్రయోజనాలను కాదని మత ఛాందసవాదులకు తల ఒగ్గిందని చాలామంది భావించారు.

అదే సమయంలో అయోధ్యలో వివాదాస్పద కట్టడమైన బాబ్రీ మసీదు ఉన్న స్థానంలో రాముడికి గుడి కట్టాలని కొంతమంది హిందువులు ఉద్యమం మొదలుపెట్టారు. అది రాముని జన్మస్థలం అని, అంతకు ముందు అక్కడ ఉన్న గుడిని పడగొట్టి మసీదు కట్టారని వాళ్ల వాదన. బాబ్రీ మసీదు నిర్వాహకులు ఇది నిజంకాదని, ఇది ముస్లిముల ప్రార్థనా స్థలమని పేర్కొన్నారు. ఈ వివాదం కొంత కాలంగా సాగుతోంది. అంతిమ నిర్ణయం తీసుకునేదాకా సంవత్సరంలో ఒక రోజు తప్పించి మసీదును మూసి ఉంచాలని కోర్టు ఆదేశించింది. 1986లో కోర్టు తీర్పు ఇస్తూ మసీదుని సంవత్సరం పొడవునా తెరిచి ఉంచవచ్చని, హిందువులను రోజువారీ పూజలకు అనుమతించాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఆమోదించినందువల్లే ఇది జరిగి ఉంటుందని చాలామంది అభిప్రాయపడ్డారు. మసీదుని గుడిగా మార్చాలనుకుంటున్న వాళ్లు మరింతమంది ప్రజలను సమీకరించటానికి గుడిని తెరవటం సహకరించింది.

రాజకీయ పార్టీలు ప్రజలలో తమ ఆదరణను కోల్పోతున్నాయని చాలామంది పరిశీలకులకు అనిపించసాగింది. అనేక అంశాలపై రాజకీయేతర నాయకత్వం కింద అనేక ప్రజా ఉద్యమాలు చెలరేగసాగాయి. మార్కెటు కోసం ఉత్పత్తి చేస్తున్న రైతులు వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన ధరల కోసం, డీజిలు, రసాయనిక ఎరువులు, విద్యుత్తు వంటి ఉత్పాదకాలపై సబ్సిడీలకోసం పోరాడసాగారు. ఉత్తరప్రదేశ్, హర్యానాలోని రైతులు మహేంద్ర సింగ్ తికాయత్ నేతృత్వంలో పోరాటం చేస్తుండగా మహారాష్ట్రలోని రైతులు శరద్ జోషీ నాయకత్వంలో పోరాడసాగారు. అనేక రాష్ట్రాలలో ఆనకట్టలు, గనుల వంటి అభివృద్ధి పథకాల వల్ల నిర్వాసితులవుతున్న గిరిజనులు, రైతులు అనేక రాష్ట్రాలలో ఉద్యమించసాగారు. జనాదరణ కోల్పోతున్న జాతీయ రాజకీయ పార్టీలు ఎన్నికలలో మద్దతుకోసం హిందూ, ముస్లిం మతభావనలకు తల ఒగ్గసాగారని పరిశీలకులు భావించసాగారు. అయితే దీనివల్ల దేశ లౌకిక స్ఫూర్తి దెబ్బతిని, తరువాత దశాబ్దంలో మత తత్వ రాజకీయాలకు అవకాశం కల్పించింది.

ఇదే సమయంలో భారతీయ సైన్యానికి శతఘ్నులు సరఫరా చేసిన స్వీడిష్ ఉత్పత్తిదారుల ద్వారా అనేక మంది నాయకులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ముడుపులు ముట్టాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలు ఖచ్చితంగా నిరూపింపబడక పోయినప్పటికీ మంత్రివర్గంలోని మాజీ మంత్రులైన విపి సింగ్ వంటి కొంతమంది నాయకత్వంలో బలమైన ఉద్యమం సాగింది. ఆ తరువాత 1989లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసేతర రాజకీయ శక్తులకు పరిపాలన, రాజకీయ రంగాలలో అవినీతి అన్నది ప్రధాన ప్రచార అంశం అయ్యింది. తమ మధ్య విభేదాలతో సంబంధం లేకుండా కాంగ్రెసేతర రాజకీయ పార్టీలు ఏకం కావటంతో కాంగ్రెస్‌కి గెలవటం కష్టమైపోయింది. అన్నిటికంటే ఎక్కువ సీట్లు కాంగ్రెస్‌కే

వచ్చినప్పటికీ అది ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే స్థితిలో లేదు. విపి సింగ్ నేతృత్వంలోని జనతా దళ్‌తో మొదటి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది.

## సంకీర్ణ రాజకీయాల శకం

1990ల కాలంలో స్వాతంత్ర్యానంతర భారతదేశంలో చాలా కీలకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. పోటీతో కూడిన బహుళపార్టీ వ్యవస్థకు మారటంతో మెజారిటీ స్థానాలు గెలిచి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి ఏ ఒక్క పార్టీకి లేదు. 1989 నుంచి జాతీయస్థాయిలో ఏర్పడిన ప్రభుత్వాలన్నీ సంకీర్ణ/ మైనారిటీ ప్రభుత్వాలే. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యటానికి అనేక జాతీయ, ప్రాంతీయ పార్టీలు కలవవలసి వచ్చేది. దీనర్థం అనేక పార్టీల రాజకీయ సిద్ధాంతాలను, కార్యక్రమాలను కలుపుకుని కనీస ఒప్పందాలకు రావలసి వచ్చేది. దాంతో ఏ ఒక్క పార్టీ తన పూర్తి పంథాను కొనసాగించటానికి వీలులేక కొంతవరకు తగ్గించుకోవలసి వచ్చేది. దీనివల్ల రాజకీయాలు, విధానాలలో అనేక దృష్టికోణాల పట్ల కేంద్ర ప్రభుత్వాలు సున్నితత్వంతో వ్యవహరించవలసి వచ్చింది. అదే సమయంలో దీనివల్ల ఎంతో అస్థిరత కూడా నెలకొంది. చిన్న పార్టీలు కూడా తమ మద్దతు ఉపసంహరించుకుంటే ప్రభుత్వం పడిపోతుంది కాబట్టి ఎక్కువ ప్రయోజనాలు రాబట్టుకోటానికి ప్రయత్నించాయి. కొన్నిసార్లు దీనివల్ల 'విధాన పక్షపాతం' కూడా సంభవించేది – అంటే ఏదో ఒక భాగస్వామి మద్దతు ఉపసంహరించుకుంటుందన్న భయంతో తీవ్ర మార్పులను తెచ్చే విధానాలను అమలు చెయ్యటానికి సంకీర్ణ ప్రభుత్వం భయపడేది.



*చిత్రం 19.7: వి.పి. సింగ్*

తొలి సంకీర్ణ ప్రభుత్వాలు చాలా అస్థిరంగా ఉండి వాటి పూర్తికాలం కొనసాగలేకపోయాయి. తరువాతి సంకీర్ణ ప్రభుత్వాలు కనీస ఉమ్మడి కార్యక్రమాలు, సమన్వయ సంఘాలువంటి పలు విధానాల ద్వారా భాగస్వాముల మధ్య మరింత అవగాహన సాధించగలిగాయి. ఫలితంగా బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమొక్రాటిక్ అలయన్స్, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెస్సివ్ అలయన్స్ (UPA)లాంటి సంకీర్ణ ప్రభుత్వాలు తమ పూర్తికాలం పదవిలో కొనసాగాయి. అంతేకాకుండా యుపిఏ సంకీర్ణ ప్రభుత్వం తిరిగి ఎన్నిక అయ్యింది.

- సంకీర్ణ రాజకీయాల వల్ల ప్రభుత్వం బలహీనపడిందని కొంతమంది భావిస్తుండగా, దానివల్ల ఏ ఒక్క పార్టీ తన విధానాన్ని దేశం మీద రుద్దకుండా చేసిందని కొంతమంది భావిస్తారు. దీనిని ఉదాహరణలతో చర్చించండి.

## పశ్చిమ బెంగాల్‌లో 'వామ పక్ష ప్రభుత్వం'

వామ పక్ష రాజకీయ పార్టీలైన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), ఫార్వర్డ్ బ్లాక్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) వంటివి 1977లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎన్నికలలో గెలిచి సిపిఎంకి చెందిన జ్యోతి బసు నాయకత్వంలో వామ పక్ష ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి.

రాష్ట్రంలో అసంపూర్తిగా ఉండిపోయిన భూ సంస్కరణలను అది ముందుగా చేపట్టింది. జూన్ 1978లో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కౌలుదార్ల పేర్లను నమోదు చేసి, వాళ్ల హక్కులను కాపాడటానికి 'ఆపరేషన్ బర్గా' చేపట్టింది (కౌలుదార్లను బెంగాలీలో బర్గాదార్లు అంటారు, వీళ్లు భూస్వాముల భూములను సాగుచేస్తూ పంటలో అధిక భాగం వాళ్లకి కౌలుగా చెల్లిస్తూ ఉండేవాళ్లు). పశ్చిమ బెంగాల్‌లో గ్రామీణ జనాభాలో ఈ కౌలుదార్లు అధిక సంఖ్యలో ఉండేవాళ్లు. పరిపాలనా సంబంధ ఆలస్యాలు, భూస్వామ్యవర్గాల పెత్తనమూ లేకుండా ఉండటానికి పంచాయితీ రాజ్ సంస్థలు, కౌలుదార్ల ఉమ్మడి కార్యాచరణపై ఆపరేషన్ బర్గా ఆధారపడింది. అధికారులు గ్రామాలలో సమావేశాలు నిర్వహించి వివిధ పాత్రధారులు చెప్పేది వినే వాళ్లు. ఆ వెంటనే కౌలుదార్ల జాబితా తయారుచేసి భూస్వాముల సమక్షంలో సరి చూసేవాళ్లు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియచెయ్యటానికి భూస్వాములకు అవకాశం ఇచ్చేవాళ్లు. అక్కడికక్కడే కౌలుదార్ల పేర్లు నమోదు చేసి, అన్ని చట్ట సంబంధ కాగితాలు తయారుచేసి వెంటనే పంచిపెట్టేవాళ్లు.

ఆపరేషన్ బర్గా ఫలితంగా కౌలుదార్లను భూస్వాములు బలవంతంగా తొలగించటానికి వీలు లేకుండా పోయింది. వాస్తవానికి కౌలుదార్ల హక్కును వారసత్వం చేసి అది కొనసాగేలా చూశారు. అంతేకాకుండా పంటలో న్యాయమైన వాటా (శ్రమ కాకుండా ఇతర పెట్టుబడి కౌలుదారు పెడితే 75%, భూస్వామి పెడితే 50%) కౌలుదారుకి దక్కేలా ప్రభుత్వం చూస్తుంది. మొత్తంగా పశ్చిమ బెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలలో సగం దాకా భూ సంస్కరణల ప్రయోజనాలను పొందాయి.

- పశ్చిమ బెంగాల్‌లోని భూ సంస్కరణలను చైనాలోని, లేదా వియత్నాంలోని భూ సంస్కరణలతో పోల్చండి. వీటిల్లో పోలికలు, తేడాలు గుర్తించండి.
- కౌలుదార్లకు రక్షణ లభించటం వల్ల ఉత్పత్తి ఎందుకు పెరిగింది?

ఈ చర్యల ఫలితంగా పశ్చిమ బెంగాల్ లో వ్యవసాయ ఉత్పత్తి 30 శాతం దాకా పెరిగింది, గ్రామీణ పేదరికం గణనీయంగా తగ్గింది. పశ్చిమ బెంగాల్‌లో అధిక శాతం కౌలుదార్లు (70% దాకా) ఇంకా నమోదు కాలేదని, ఈ పాక్షిక అమలు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ధనిక వర్గం ఏర్పడిందని విమర్శకులు భావిస్తారు.

ఏదేమైనప్పటికీ ఆపరేషన్ బర్గా, పంచాయితీ రాజ్ వ్యవస్థ అమలువల్ల వామ పక్షానికి గ్రామీణ జనాభాలో గణనీయమైన మద్దతు లభించింది. 2006 వరకు అన్ని ఎన్నికలలోనూ విజయం సాధించింది. రాష్ట్ర ప్రజల అవసరాలను ప్రజాస్వామికంగా తీర్చిన ఉదాహరణలలో ఇది ఒకటి.

*1980ల నుంచి సంకీర్ణ ప్రభుత్వాలు కొన్ని రాజకీయ పార్టీలు*

| నేషనల్ ఫ్రంట్ 1989-1990 | యునైటెడ్ ఫ్రంట్ 1996-1998 | నేషనల్ డెమోక్రాటిక్ అలయన్స్ 1998-2004 |
|---|---|---|
| **అధికారంలో ఉన్న పార్టీలు** | **అధికారంలో ఉన్న పార్టీలు** | **అధికారంలో ఉన్న పార్టీలు** |
| జెడి, డిఎంకె, ఎజిపి, టిడిపి జమ్ము & కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (జెకె ఎన్‌సి) | జెకెఎన్‌సి, టిడిపి, టిఎంసి, సిపిఐ, ఎజిపి, డిఎంకె, ఎంజిపి, | జెడియు, ఎస్‌ఎడి, ఎఐఎడిఎంకె, జెకెఎన్‌సి, తృణమూల్ కాంగ్రెస్, బిజూ జనతా దళ్, శివసేన |
| **మద్దతునిచ్చిన పార్టీలు** | **మద్దతునిచ్చిన పార్టీలు** | **మద్దతునిచ్చిన పార్టీలు** |
| **సిపిఎం, సిపిఐ, బిజెపి** | **సిపిఎం** | **టిడిపి** |

ఇది ప్రభుత్వంలో భాగస్వాములైన లేదా మద్దతు ఇచ్చిన అన్ని రాజకీయ పార్టీల జాబితా కాదు. తరచు, అయిదుగురు లేదా అంతకంటే ఎక్కువ ఎంపీలు ఉన్న పార్టీలను పేర్కొన్నాం.

## 20వ శతాబ్దపు చివరి దశకంలోని సమస్యలు

రాజకీయాల్లో ఈ మార్పుతోపాటు ఇతర కీలకమైన పరిణామాలు కూడా సంభవించాయి. భారతదేశంలోకి స్వేచ్ఛగా విదేశీ పెట్టుబడులు, వస్తువులను అనుమతించేలా భారత ఆర్థిక విధానం బలవంతంగా సరళీకృతం చేయబడింది. ఇంకొకవైపు కొత్త సామాజిక వర్గాలు మొదటిసారిగా తమ రాజకీయ ఆకాంక్షలను సాధించుకోటానికి ప్రయత్నించసాగాయి. అంతేకాకుండా రాజకీయ జీవితంలో మతపర జాతీయతావాదం, మతం పేరుతో రాజకీయ సమీకరణలు ముఖ్యాంశాలుగా మారాయి. వీటన్నిటి కారణంగా భారతీయ సమాజం తీవ్ర కల్లోలానికి లోనయ్యింది. ఈ మార్పులను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా మారే ప్రయత్నంలోనే ఇంకా మనం ఉన్నాం.

### రాజ్యాంగ సౌకర్యాల విస్తరణ

వెనుకబడిన తరగతుల ప్రజలకి కూడా అవకాశాలు కల్పించటంపై వాళ్లని కూడా కలుపుకుని అభివృద్ధి సాధించటంపై జనతా దళ్ దృష్టి కేంద్రీకరించింది. ప్రభుత్వ ఉద్యోగాలలోనూ, విద్యా సదుపాయాలలోనూ ఇతర వెనుకబడిన తరగతులకు (ఒబిసిలకు) రిజర్వేషన్లు ఉండాలని సిఫారసు చేసిన మండల్ కమిషన్ నివేదికను నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వెలికి తీసింది. ఈ కమిషన్ గుర్తించిన సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 27% రిజర్వేషన్లు కల్పించమన్న మండల కమిషన్ ముఖ్యమైన సిఫారసును అమలు చేస్తున్నట్టు విపి సింగ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఆదేశాలతో అనేక నిరసనలు, ప్రత్యేకించి ఉత్తర భారతదేశంలో చెలరేగాయి. దక్షిణాదిన అప్పటికే అనేక రాష్ట్రాలు ఒబిసిలకు అధిక శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నాయి. విపి సింగ్ ప్రభుత్వ ఈ నిర్ణయం పట్ల అనేక ఇతర రాజకీయ పార్టీలు అనుకూలంగా లేవు. కానీ తాము జనాదరణ కోల్పోతామన్న భయంతో దాని పట్ల వ్యతిరేకతను ప్రకటించలేదు. గత రెండు దశాబ్దాలలో ఒబిసి కులాల్లో అనేకం సంపన్నులై తమ ఉనికిని చాటుకోవటానికి ప్రయత్నిస్తుండటమే దీనికి కారణం. వాళ్లు ప్రత్యేకంగా భూ సంస్కరణలు, హరిత విప్లవం ద్వారా లాభపడ్డారు. అయితే విద్యలోను, ప్రభుత్వ ఉద్యోగాలలోను, రాజకీయాలలో సైతం తమకు తగినంత ప్రాతినిధ్యం లేదని భావించసాగారు. ఈ రంగాలలో ఇప్పుడు వీళ్లు తమ వాటా కోరసాగారు. మండల్ కమిషన్ సిఫారసులను అమలుచేయటం ద్వారా విపి సింగ్ ప్రభుత్వం వాళ్ల కోరికను తీర్చింది. క్రమేపీ పరిపాలనా విధానం కుల సమస్యలకు, ప్రత్యేకించి తక్కువ కులాల వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలకు మరింత

#### పంచాయతీరాజ్ & 73వ సవరణ

స్థానిక స్వపరిపాలనకు రాజ్యాంగ గుర్తింపునిస్తూ 1992వ సంవత్సరంలో పి.వి. నరసింహారావు ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసింది. 73వ రాజ్యాంగ సవరణ గ్రామ స్థాయిలో స్థానిక స్వపరిపాలనా ప్రభుత్వాలను కల్పించగా, 74వ రాజ్యాంగ సవరణ పట్టణ, నగరాలకు వాటి స్థాయిలో ప్రభుత్వాలను సార్వత్రిక వయోజన ఓటింగ్ ద్వారా మొట్టమొదటిసారి ఎన్నుకున్నారు. మొత్తం స్థానాలలో మూడింట ఒకవంతు (1/3వ వంతు) స్థానాలను స్త్రీలకు కేటాయించారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులకు కూడా కొన్ని స్థానాలను రిజర్వు చేసారు. రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను గౌరవిస్తూ స్థానిక స్వపరిపాలనా ప్రభుత్వాలకు ఉండే విధులు, అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయానికి వదలి పెట్టారు. అందువలన, దేశ వ్యాప్తంగా పని చేసే స్థానిక స్వపరిపాలనా ప్రభుత్వాల అధికారాలలో తేడాలుంటాయి.

సున్నితంగా స్పందించసాగింది. దళితుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నామనే బహుజన సమాజ్ పార్టీ, పైకెదుగుతున్న జాట్, యాదవుల వంటి కులాలకు ప్రాతినిధ్యం వహించే ప్రాంతీయ పార్టీలు భారతదేశ రాజకీయాలలో ముఖ్యపాత్ర పోషించసాగాయి.

## రాజకీయాలు, మత వినియోగం

జనాభా సంఖ్యలో అత్యధికులు అంటే హిందువుల మత అస్తిత్వ ఆధారంగా దేశాన్ని నిర్మించాలన్న రాజకీయ ధోరణికి భారతీయ జనతా పార్టీ నేతృత్వం వహిస్తోంది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం వంటివి పాశ్చాత్య భావాలని, ఇవి సరిపోవని, పురాతన భారతీయ సంస్కృతినుంచి మనం నేర్చుకోవాలని ఈ పార్టీ విశ్వసిస్తుంది. అయితే మతగురువులు నడిపే మతపరమైన రాజ్యానికి బిజెపి వ్యతిరేకం. లౌకికరాజ్యం అల్పసంఖ్యాక వర్గాలకు మాత్రమే ప్రత్యేక సదుపాయాలు కల్పించడం కాకుండా, దేశ ప్రజలందరినీ సమదృష్టితో చూస్తూ ఒకే పౌర చట్టాన్ని అమలు చేయాలని బిజెపి లౌకికవాద స్వరూపం చర్చను ప్రారంభించింది.

1980ల వరకు భారత రాజకీయాలలో ఈ ధోరణి నామమాత్రంగా ఉండేది. ఉదాహరణకు 1984 లోకసభ ఎన్నికలలో వీళ్లు రెండు సీట్లు మాత్రమే గెలిచారు. అయితే అయోధ్య అంశాన్ని – రాముడు పుట్టిన ప్రదేశమంటూ మసీదు ఉన్నచోట గుడి కట్టటానికి ఉద్యమాన్ని చేపట్టటంతో బిజెపికి ఆదరణ గణనీయంగా పెరిగింది. ఈ అంశాలకు మద్దతుగా బిజెపి నాయకుడైన ఎల్ కె అద్వాని 1990లో సోమనాథ్‌నుంచి అయోధ్యవరకు 'రథయాత్ర' చేపట్టాడు. ఈ లౌకికవాద రాజకీయాలు అల్పసంఖ్యాక వర్గాలను, ప్రత్యేకించి ముస్లిములను సంతృప్తి పరచటానికి ప్రయత్నించి, అధిక సంఖ్యలో ఉన్న హిందువులను నిర్లక్ష్యం చేస్తున్నాయని వాదించసాగారు. ఈ ఉద్యమ సమయంలో ప్రజలు పలుప్రాంతాలలో మతపరంగా చీలిపోయారు. పెద్ద ఎత్తున మతపరమైన అల్లర్లు చెలరేగాయి. బీహార్‌లో అద్వానీని అరెస్టు చెయ్యటంతో ఈ యాత్ర ముగిసింది. దీనికి ప్రతిగా విపి సింగ్ ప్రభుత్వానికి బిజెపి తన మద్దతును ఉపసంహరించుకుని ముందుగానే ఎన్నికలు జరిపేలా చేసింది.

శ్రీలంకకు భారతీయ సైన్యాన్ని పంపించటంలో అతని పాత్రకు ప్రతీకారంగా శ్రీలంకలోని తమిళ వేర్పాటువాద బృందమైన ఎల్‌టిటిఇ చేతిలో ఈ ఎన్నికల ప్రచారంలో రాజీవ్‌గాంధి హత్యకు గురయ్యాడు. ఆ తరువాత కురిసిన సానుభూతి వెల్లువలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే లోకసభలో బిజెపి బలం 120కి పెరిగింది. రామాలయ ప్రచారంలో సమీకరింపబడిన పెద్దగుంపు 1992లో అయోధ్యకు చేరి మసీదును ధ్వంసం చేసింది. ఈ ఘటన తరువాత తీవ్ర నిరసనలు, మతకల్లోలాలు చెలరేగాయి, చాలా ప్రాణనష్టం జరిగింది.

## సరళీకృత ఆర్థిక విధానం

1991లో విపి సింగ్ ప్రభుత్వం పడిపోయినప్పుడు భారతదేశం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అప్పులను తిరగి కట్టటానికి, దిగుమతులకు చెల్లించటానికి ఉపయోగించే విదేశీ మారక నిల్వలు దాదాపుగా అడుగంటాయి. అంటే వెంటనే కొత్త అప్పు దొరికితే తప్పించి పాత బకాయిల కిస్తీలను సకాలంలో కట్టలేని పరిస్థితిలో భారతదేశం ఉంది. 1992లో పివి నరసింహారావు నేతృత్వంలో ఏర్పడిన కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని అధిగమించటానికి అంతర్జాతీయ ద్రవ్యనిధితో సంప్రదింపులు నిర్వహించింది. ఇందుకు అది కొన్ని తీవ్రమైన షరతులను విధిస్తూ (వీటిని 'వ్యవస్థాగత


మార్పుల కార్యక్రమం' అంటారు) భారతదేశం సరళీకృత ఆర్థిక విధానాన్ని అవలంబించేలా చేసింది. దీని అర్థం –

అ. ప్రభుత్వ ఖర్చును తీవ్రంగా తగ్గించుకోవటం – దీంట్లో రైతులకు ఇచ్చే సబ్సిడీలలో కోత, ప్రజాసేవలు, ఆరోగ్యం వంటి వాటిల్లో ప్రభుత్వ ఖర్చును తగ్గించుకోవటం వంటివి కూడా ఉన్నాయి.

ఆ. విదేశీ సరుకుల దిగుమతుల మీద పరిమితులను, పన్నులను తగ్గించుకోవటం.

ఇ. భారతదేశంలో విదేశీ పెట్టుబడులపై పరిమితులను తగ్గించుకోవటం.

ఈ. ఆర్థిక రంగంలోని అనేక రంగాలలో (ఉదాహరణకు టెలిఫోన్లు, బ్యాంకింగ్, విమానయానం, వంటి వాటిల్లో) ప్రైవేటు పెట్టుబడిదారులకు అవకాశం కల్పించటం (ఇవి ఇంతకు ముందు ప్రభుత్వ గుత్తాధిపత్యం కింద ఉండేవి).




చిత్రం 19.8: పి.వి. నరసింహా రావు

ఈ చర్యల కారణంగా భారతదేశంలోకి విదేశీ సరుకులు రావటంతో భారతీయ పారిశ్రామికవేత్తలకు ప్రపంచ ఉత్పత్తిదారులతో పోటీ పడక తప్పలేదు. దీనివల్ల విదేశీ కంపెనీలు భారతదేశంలో పరిశ్రమలను నెలకొల్పాయి, వ్యాపారాలు మొదలుపెట్టాయి. అయితే ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే సబ్సిడీలలో కోత విధించటం వల్ల చౌక విదేశీ సరుకులు వెల్లువెత్తడంతో ఇక్కడ అనేక కర్మాగారాలు మూతపడటం వల్ల సాధారణ ప్రజలు ఎన్నో కష్టాలకు గురయ్యారు. విద్య, ఆరోగ్యం, రవాణా వంటి అనేక ప్రభుత్వ సదుపాయాల ప్రైవేటీకరణకు కూడా ఇది దారి తియ్యటంతో ఈ సేవలు అందించే ప్రైవేటు వ్యక్తులకు ప్రజలు పెద్ద మొత్తంలో డబ్బులు/ రుసుం చెల్లించాల్సి వస్తోంది.



చిత్రం 19.9 : హెచ్.డి. దేవెగౌడ



చిత్రం 19.10: ఎ.బి. వాజ్‌పేయి

20వ శతాబ్దం ముగింపులో భారతదేశం ప్రపంచ మార్కెట్‌లోకి లాగబడింది. ఈ భారతదేశంలో ఒకవైపున జనాభాలోని వివిధ వర్గాల గొంతులు వినిపించే ప్రజాస్వామ్యం విలసిల్లుతోంది, ఇంకోవైపున ప్రజలను విభజించే, మతపర రాజకీయ సమీకరణల వల్ల సామాజిక శాంతికి ముప్పు పొంచి ఉంది. యాభైఏళ్లకు పైగా అది కాలపరీక్షకు నిలబడింది; ఎంతో కొంత స్థిర ఆర్థిక పరిస్థితిని సాధించింది; ప్రజాస్వామిక రాజకీయాలు బలంగా వేళ్లూనుకున్నాయి. తీవ్ర పేదరికాన్ని, కులాలు, మతాలు, ప్రాంతాలు, స్త్రీ – పురుషుల మధ్య తీవ్ర అసమానతల్ని అది ఇంకా పరిష్కరించలేదు. 21వ శతాబ్ద భారతదేశానికి యాభై ఏళ్ల స్వాతంత్ర్యానంతరకాలం అందించిన వారసత్వం ఇదే.

## ముగింపు

భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొని నిలిచిందని, ఆ ప్రక్రియలో అది మరింత బలపడిందని చూశాం. క్రమం తప్పకుండా జరిగే స్వేచ్ఛాయుత, న్యాయపూరిత ఎన్నికలు, ఎన్నికలలో ఓటు వేసే వాళ్ల సంఖ్య,

ప్రభుత్వాల మార్పు, కొత్త గ్రూపుల సాధికారీకరణ, పౌర హక్కులను కాపాడటం వంటి అనేక విషయాలలో భారత ప్రజాస్వామ్యం విజయవంతమయ్యిందని చెప్పవచ్చు. అయితే శతాబ్దపు అంచులో భారత ప్రజాస్వామ్యం గురించి అనేక ప్రశ్నలు కూడా లేవనెత్తాయి. దీర్ఘకాలం ప్రజాస్వామిక దేశంగా ఉన్నప్పటికీ అధిక శాతం పౌరుల సంక్షేమాన్ని భారతదేశం ఎందుకు సాధించలేకపోయింది? అభివృద్ధి ప్రక్రియ లేవనెత్తిన పరస్పర విరుద్ధ కోరికల కారణంగా ఉత్పన్నమయ్యే ఒత్తిడిని అది ఎలా ఎదుర్కొంటుంది? పాదుకుని ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలను ప్రజాస్వామిక భారతదేశం ఎందుకు తగ్గించలేకపోయింది? రానున్న సంవత్సరాలలో ఈ ప్రశ్నలను, సమస్యలను భారతదేశం ఎదుర్కోవాలి. భారతదేశం ఇది చెయ్యగలుగుతుందని మీరు అనుకుంటున్నారా?

### కీలక పదాలు

| | | |
|---|---|---|
| ప్రాంతీయ ఆకాంక్షలు | సంకీర్ణ ప్రభుత్వాలు | మతతత్వ వాదం |
| అధిక సంఖ్యాక వర్గం | అల్ప సంఖ్యాక వర్గం | |

### మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది వాటిని జతపరచండి:

| | |
|---|---|
| సరళీకృత ఆర్థిక విధానం | విదేశీ దిగుమతులపై పన్నులమీద పరిమితులు |
| ఇష్టమొచ్చినట్లు తొలగించటం | కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు |
| ఇతరుల తొలగింపు | తమకంటే భిన్నంగా ఉన్న ప్రజలకు |
| సమాఖ్య సిద్ధాంతం | రాష్ట్ర ప్రభుత్వాలకు మరింత స్వయం ప్రతిపత్తి |

2. స్వాతంత్ర్యానంతర రెండవ దశలో పార్టీ వ్యవస్థలో ప్రధాన మార్పులను గుర్తించండి.
3. కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో వివిధ ప్రభుత్వాల ప్రధాన ఆర్థిక విధానాలలో వేటిని గురించి ఈ అధ్యాయంలోనూ, ఇంతకు ముందు అధ్యాయాలలోనూ చర్చించారు? వాటిల్లో పోలికలు, తేడాలు ఏమిటి?
4. ప్రాంతీయ ఆకాంక్షలు ప్రాంతీయ పార్టీల ఏర్పాటుకు ఎలా దారితీశాయి? రెండు దశలలోని పోలికలు, తేడాలను వివరించండి.
5. ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యాలంటే రాజకీయ పార్టీలు సమాజంలోని భిన్న వర్గాల ప్రజలను ఆకర్షించాలి. స్వాతంత్ర్యానంతర రెండవ దశలో ఈ పనిని వివిధ రాజకీయ పార్టీలు ఎలా చేశాయి?
6. భారతీయ పరిపాలనా విధానంలో అందరినీ కలుపుకునే స్వభావం బలహీన పడటానికి కారణమైన పరిణామాలు ఏమిటి? వివిధ ప్రజలను, రాజకీయ ఆకాంక్షలను కలుపుకుని వెళ్లగల సామర్థ్యం ఏ విధంగా దెబ్బతింటోంది?
7. వివిధ ప్రాంతీయ ఆకాంక్షలు సాంస్కృతిక, ఆర్థిక కోణాలను ఏ విధంగా ఉపయోగించుకుంటాయి?
8. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలి సగంలో ప్రణాళికాబద్ధ అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చారు. రెండవ సగంలో సరళీకృత ఆర్థిక విధానానికి ప్రాధాన్యతను ఇచ్చారు. ఇవి రాజకీయ భావాలను ఎలా ప్రతిఫలింపచేశాయో చర్చించండి.
9. సంకీర్ణ ప్రభుత్వం వల్ల విధానాలలో మధ్యేమార్గాన్ని అవలంబించటానికి సంకీర్ణ ప్రభుత్వంలోని వివిధ రాజకీయ పార్టీలు తమ ప్రాంతీయ కోరికలను సాధించుకునే విధానానికి ఉదాహరణలను వార్తా పత్రికలు, వార పత్రికలు చదవటం ద్వారా గుర్తించండి.